నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
17వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
సోమవారం
24 జూన్ 2024
పేజీలు: 02





# తెలంగాణలో 44 మంది ఐఏఎస్‌ల బదిలీలు

జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలి నియామకం

ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీగా రొనాల్డ్ రోస్

తెలంగాణ ప్రభుత్వం సోమవారం భారీగా ఐఏఎస్‌ల బదిలీలు చేపట్టింది. ఒకే రోజు 44 మంది అధికారులకు స్థానచలనం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

**బదిలీ అయిన అధికారులు వీరే..**

జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలి, పశు సంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శిగా సవ్యసాచి ఘోష్‌ను తెలంగాణ ప్రభుత్వం నియమించింది. కార్మిక ఉపాధి శిక్షణ శాఖ ముఖ్య కార్యదర్శిగా సంజయ్ కుమార్, యువజన సర్వీసులు, పర్యాటక, క్రీడల శాఖ ముఖ్య కార్యదర్శిగా వాణిప్రసాద్‌ను నియమించారు.
జీఏడీ ముఖ్య కార్యదర్శిగా సుదర్శన్ రెడ్డి.. చేనేత, హస్తకళల ముఖ్య కార్యదర్శితో పాటు హ్యాండ్లూమ్స్, టీజీసీవో హ్యాండ్ క్రాఫ్ట్స్ ఎండీగా శైలజా రామయ్యను నియమించారు.
ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా సందీప్ సుల్తానియాను నియమించారు. ఆయనకు ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శిగానూ అదనపు బాధ్యతలు అప్పగించారు.పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్య కార్యదర్శిగా సందీప్ కొనసాగనున్నారు. అటవీ, పర్యావరణ శాఖల ముఖ్య కార్యదర్శిగా అహ్మద్ నదీమ్‌ను నియమించడం సహా టీపీటీఆర్ఐ డీజీగా ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు.



# 18వ లోక్‌సభ ప్రారంభం

18వ లోక్‌సభ తొలి సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. కొత్తగా ఎన్నికైన లోక్‌సభ సభ్యులతో 24, 25 తేదీల్లో ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్ ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. ఈ నెల 26న లోక్‌సభ స్పీకర్ ఎన్నిక ఉంటుంది. 27న ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తారు. 28 నుంచి రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై పార్లమెంట్‌లో చర్చ ఉంటుంది. జులై 2 లేదా 3న ప్రధాని నరేంద్ర మోదీ ఈ చర్చకు బదులిచ్చే అవకాశం ఉంది.

### ప్రొటెం స్పీకర్‌గా భర్తృహరి ప్రమాణం

18వ లోక్‌సభ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలుత ప్రొటెం స్పీకర్‌గా భర్తృహరి మహతాబ్ చేతి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణం చేయించారు. భర్తృహరి మహతాబ్ ఏడుసార్లు ఎంపీగా పనిచేశారు.

### వికసిత భారత్ లక్ష్యంగా ముందుకు సాగుదాం : ప్రధాని

18వ లోక్‌సభ తొలి సమావేశం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంట్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. 'కొత్తగా ఎన్నికైన సభ్యులకు స్వాగతాభినందనలు. కొత్త పార్లమెంటులో 18వ లోక్‌సభ సమావేశమవుతోంది. భారత ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా కృషి చేయాలి. 2047 వికసిత్ భారత్ సంకల్పం, లక్ష్యాన్ని నెరవేర్చే దిశగా సాగుతాం. కొత్త లక్ష్యాలు నిర్దేశించుకుని ముందుకుసాగుదాం. మూడోసారి సేవచేసే భాగ్యాన్ని ప్రజలు కల్పించారు. సభ్యులందరినీ కలుపుకొని వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకుంటాం. ప్రజలు మా విధానాలను విశ్వసించారు' అని ప్రధాని మోదీ అన్నారు.

### ఎమర్జెన్సీ ఒక మచ్చ


'సరికొత్త విశ్వాసంతో కొత్త సమావేశాలు ప్రారంభిస్తున్నాం. రాజ్యాంగ ప్రొటోకాల్స్ పాటిస్తాం. రాజ్యాంగానికి గౌరవం ఇచ్చి నిర్ణయాలు తీసుకుంటాం. ప్రజల స్వప్నం నెరవేర్చే సంకల్పం తీసుకున్నాం. అత్యయిక పరిస్థితికి రేపటి 50 ఏళ్లు పూర్తవుతాయి అత్యయిక పరిస్థితి ఒక మచ్చ. ప్రధాని మోదీ 50 ఏళ్ల క్రితం జరిగిన పొరపాటు పునరావృతం కాకూడదు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు విపక్షాలు కూడా సహకరించాలి. విపక్షాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. మూడోసారి అధికారంలోకి రావడం వల్ల మాపై మరింత బాధ్యత పెరిగింది.' అని ప్రధాని మోదీ అన్నారు.
కొత్తగా ఎన్నికైన సభ్యులతో ప్రొటెం స్పీకర్ ప్రమాణస్వీకార కార్యక్రమం
రెండ్రోజులపాటు లోక్‌సభ సభ్యుల ప్రమాణస్వీకారాలు
ప్రస్తుత లోక్‌సభలో అడుగుపెట్టేవారిలో సగానికి పైగా కొత్తవారే
మొత్తం 543 మంది సభ్యుల్లో తొలిసారి లోక్‌సభకు 280 మంది సభ్యులు
లోక్‌సభ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం
లోక్‌సభలో ప్రమాణస్వీకారం చేసిన నరేంద్ర మోదీ
లోక్‌సభలో ప్రమాణస్వీకారం చేసిన రాధామోహన్ సింగ్



# ఆంధ్రప్రదేశ్ తొలి కేబినెట్ భేటీ


## సీఎం నారా చంద్రబాబు గారి అధ్యక్షతన తొలి కేబినెట్ సమావేశం

ఆంధ్రప్రదేశ్‌లో సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చేందుకు, వచ్చే 5 ఏళ్లలో అనుసరించాల్సిన కార్యాచరణపై మంత్రులకు దిశానిర్దేశం చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన నేడు తొలి మంత్రివర్గ సమావేశం జరగనుంది. జూలై నెలాఖరుకల్లా ఓటాన్ అకౌంట్ బడ్జెట్ స్థానంలో సాధారణ బడ్జెట్ ప్రవేశపెట్టాల్సి ఉన్నందున, అసెంబ్లీ సమావేశాల నిర్వహణ, బడ్జెట్‌లో చేర్చాల్సిన అంశాలపై చర్చించనున్నట్లు సమాచారం. వివిధ శాఖల్లో వాస్తవ స్థితిగతులను ప్రజలకు తెలిపేలా శ్వేతపత్రాల విడుదలపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై శాఖాధిపతులకు దిశానిర్దేశం చేయటంతో పాటు వచ్చే 100 రోజుల్లో అమలు చేయాల్సిన కార్యాచరణపై ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యాలు నిర్దేశించనున్నట్లు తెలుస్తోంది.
వాటికి నేటి సమావేశంలో ఆమోదం: ఏపీలో తొలి మంత్రివర్గ సమావేశం ఇవాళ సచివాలయంలో జరగనుంది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, పింఛన్ మొత్తం 4 వేలకు పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, నైపుణ్య గణనపై చంద్రబాబు ఐదు సంతకాలు చేశారు. వాటికి నేటి మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలపనున్నారు.
ఎన్నికల్లో ప్రధాన హామీలుగా ప్రకటించిన సూపర్ 6 పథకాల అమలు, అందుకు అనుగుణంగా





బడ్జెట్ రూపకల్పనపైనా మంత్రివర్గంలో చర్చిస్తారని సమాచారం.
మంత్రులు తమ శాఖలపై పట్టు పెంచుకునేందుకు ముఖ్యమంత్రి పలు సూచనలు చేయనున్నారు. వివిధ కార్పొరేషన్ల పునరుద్ధరణ వాటికి నిధుల సమీకరణ, పరిశ్రమలకు ప్రోత్సాహం, ఆర్థిక రాజధానిగా విశాఖ అభివృద్ధి, ఎన్నికల్లో ప్రకటించిన బీసీలకు రక్షణ చట్టం హామీ అమలుకు, వివిధ కేసుల పరిష్కరానికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటు, నూతన విద్యావిధానం, ఉచిత ఇసుక, మైనింగ్ వంటి కీలక అంశాలపై మంత్రి వర్గం చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు తొలి మంత్రి వర్గ సమావేశం కావటంతో వివిధ వర్గాలకు లబ్ధి చేకురేలా పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.






# మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నారా లోకేశ్

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకరం చేశారు. ఏపీ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎంగా పవన్ కల్యాణ్, తదితర మంత్రులు బాధ్యతలు స్వీకరించి ఆయా శాఖల కార్యకలాపాలపై దృష్టి సారించారు. తాజాగా, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.టీడీపీ యువ నాయకుడు నారా లోకేశ్ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఐటీ, విద్య, ఆర్టీజీ శాఖల మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు సచివాలయం నాలుగో బ్లాక్ రూం నంబర్ 208లోని తన ఛాంబర్‌లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలు ఫైళ్లను పరిశీలించారు. కాగాచ ఆయన సచివాలయానికి వచ్చే సమయంలో పండితులు వేదమంత్రోచ్ఛరణలతో స్వాగతం పలికారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన లోకేశ్‌కు టీడీపీ నేతలు, అధికారులు అభినందనలు తెలిపారు.కాగా, ఏపీ మంత్రివర్గం సైతం ఉదయం తొలిసారిగా భేటీ అవుతోంది.




## 'వైజయంతి ఐపీఎస్' గా లేడీ సూపర్ స్టార్

# విజయశాంతి

నందమూరి కళ్యాణ్ రామ్ నటిస్తున్న తాజా చిత్రం ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. కళ్యాణ్ రామ్ కెరీర్ లో 21వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాను NKR21 అనే వర్కింగ్ టైటిల్ తో రూపొందిస్తున్నారు. ఈ సినిమాను ప్రదీప్ చిలుకూరి పూర్తి యాక్షన్ ఎంటర్టైనర్ గా తెరెక్కిస్తున్నారు. కాగా, ఈ సినిమాలో లేడీ సూపర్ స్టార్ విజయశాంతి ఓ కీలక పాత్రలో నటిస్తున్న సంగతి తెలిసిందే. అయితే, ఆమె పుట్టినరోజు కానుకగా ఆమె పాత్రను ఇంట్రొడ్యూస్ చేశారు మేకర్స్. విజయశాంతికి ఎంతో పేరును తీసుకొచ్చిన 'వైజయంతి IPS' గా మరోసారి ఆమె తన సత్తా చాటనున్నారు. ఈ సినిమాలోనూ ఆమె పవర్ఫుల్ పోలీస్ ఆఫీసర్ గా కనిపిస్తున్నారు. "వైజయంతి IPS.. తను పట్టుకుంటే పోలీస్ తుపాకీకి ధైర్యం వస్తుంది.. వేసుకుంటే యూనిఫాంకు పౌరుషం వస్తుంది.. తనే ఒక యుద్ధం.. నేనే తన సైన్యం.." అంటూ కళ్యాణ్ రామ్ చెప్పిన డైలాగ్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ఇక ఈ సినిమాలో అందాల భామ సాయీ మంజ్రేకర్ హీరోయిన్ గా నటిస్తోంది. శ్రీకాంత్, సోహెల్ ఖాన్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు అజనీష్ లోక్ నాథ్ సంగీతం అందిస్తున్నారు. అశోక్ వర్ధన్ ముప్ప, సునీల్ బలుసు ఈ సినిమాను ప్రొడ్యూస్ చేస్తున్నారు.

## బీఆర్ఎస్‌కు దెబ్బ మీద దెబ్బ..

# కాంగ్రెస్‌లోకి ఎమ్మెల్యే సంజయ్

తెలంగాణలో కాంగ్రెస్ లోకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వలసల పర్వం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే ఆ పార్టీకి చెందిన జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సంజయ్ కుమార్ అధికార పార్టీలోకి జంప్ అయ్యారు. ఆదివారం రాత్రి జూబ్లీహిల్స్‌లో ముఖ్యమంత్రి నివాసానికి చేరుకుని ఎ. రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సంజయ్‌కుమార్‌కు టీపీసీసీ చీఫ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంజయ్ కుమార్ కాంగ్రెస్ నేతగా పని చేస్తూ తన నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన తర్వాత మొత్తం ఐదుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు. దానం నాగేందర్, తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, సంజయ్ కుమార్ అధికార పార్టీలో చేరడంతో అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్షం బలం 39 నుంచి 34కి పడిపోయింది. నవంబర్ 2023లో జరిగిన ఎన్నికల్లో జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సంజయ్ వరుసగా రెండోసారి ఎన్నికయ్యారు.



# హజ్‌యాత్రలో 1301 మంది మృతి.. అధికారికంగా ప్రకటించిన సౌదీ




ముస్లింల పవిత్ర హజ్ యాత్ర సందర్భంగా పెద్దసంఖ్యలో భక్తులు మృతిచెందారు. ఎండ తీవ్రత కారణంగా వడదెబ్బకు వేల సంఖ్యలో యాత్రికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ క్రమంలో యాత్రకు వచ్చినవారిలో 1,301 మంది చనిపోయారని సౌదీ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. వారిలో 83 శాతం మంది అనధికారికంగా హజ్ చేయడానికి వచ్చారని తెలిపింది. కాగా, అస్వస్థతకు గురైన 95 మంది దవాఖానల్లో చికిత్స పొందుతున్నారని వెల్లడించింది. చనిపోయిన వారిలో 98 మంది భారతీయులు ఉన్నారు. ఈ ఏడాది హజ్ యాత్రకు దాదాపు 22 దేశాల నుంచి పది లక్షల మంది యాత్రికులు రాగా.. సౌదీ అరేబి యా పౌరులు 2 లక్షల మందికి పైగా హాజర య్యారు. ఈజిప్టు నుంచి మరో 10 లక్షలకుపైగా ముస్లింలు తరలివచ్చారని ప్రభుత్వం తెలిపింది. అ యితే అధిక ఎండలు, వేడి గాలుల వల్ల యాత్రికులు ఉక్కపోతతో ఇబ్బంది పడ్డారని పేర్కొంది.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



## ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసే యోచనలో జీవన్ రెడ్డి

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌ను కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకోవడంపై జీవన్ రెడ్డి ఆగ్రహం. బీఆర్ఎస్ పార్టీ నుండి తన జిల్లాలోని ఇద్దరు ఎమ్మెల్యేలను చేర్చుకున్న తనకు కనీసం సమాచారం ఇవ్వలేదని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆగ్రహం. సంజయ్‌ను కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకోవడాన్ని నిరసిస్తూ.. జగిత్యాల కిసాన్ సెల్ కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్ పదవికి రాజీనామా చేసిన వాకిటి సత్యం రెడ్డి. జీవన్ రెడ్డి ఇంటికి భారీగా చేరుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు.

తెలంగాణ అసెంబ్లీలో పెరిగిన కాంగ్రెస్ బలం

ఐదుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ప్రస్తుతం హస్తం పార్టీ బలం 70కి చేరింది. తెల్లం వెంకటరావు (భద్రాచలం), దానం నాగేందర్ (ఖైరతాబాద్), కడియం శ్రీహరి (స్టేషన్ ఘన్‌పూర్), పోచారం శ్రీనివాస్ రెడ్డి (బాన్సువాడ), సంజయ్ (జగిత్యాల) పార్టీ మారారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 64, BRS 39 సీట్లు సాధించాయి. ఇటీవల కంటోన్మెంట్ ఉపఎన్నికలోనూ కాంగ్రెస్ గెలవడంతో దాని బలం 70కి పెరిగింది.


## చెంచు మహిళ ఈశ్వరమ్మ ఘటనలో కొత్త కోణం

భూమి కోసం 20 రోజుల క్రితం ఈశ్వరమ్మ మామ నాగన్న హత్య. కొల్లాపూర్ లోని చెంచు మహిళ ఈశ్వరమ్మ పై జరిగిన అమానుష దాడి ఘటనలో ఆలస్యంగా మరికొన్ని విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. చెంచుల భూముల పై కన్నేసిన కొంత మంది చెంచుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని వారి భూమిని దక్కించుకునేందుకు హత్య చేసేందుకు కూడా వెనకడలేదన్న అనుమానాలు వ్యక్తవుతున్నాయి. చెంచు మహిళ ఈశ్వరమ్మ భూమిని కౌలు తీసుకున్న వ్యక్తులు ఆమె పై పాశవికంగా దాడి చేసిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన విషయం తెలిసిందే. ఈ నెల 3న ఈశ్వరమ్మ చిన్నమామ కాట్రాజు నాగన్న (56)కు చెందిన 2.5 ఎకరాల భూమిని బండి వెంకటేష్ ఎకరా రూ. 20 లక్షలు పలుకుతుండగా రూ. 4.5 లక్షల చొప్పున ఇవ్వాలని ఒత్తిడి చేశాడు. అందుకు నాగన్న ఒప్పుకోకపోవడంతో గ్రామ శివారులో హత్య చేయగా పోస్టుమార్టం చేయకుండానే అంత్యక్రియలు చేశారు.. భూతగాదా నేపథ్యంలో ఆయన్ను హత్య చేసి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



## నెరవేరిన ఆకాంక్షలు.. తిరుమలకు రాజధాని రైతుల పాదయాత్ర


ఏపీలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడం, అమరావతి ఉద్యమ ఆకాంక్షలు నెరవేరడంతో రాజధాని ప్రాంత రైతులు తిరుమలకు కృతజ్ఞత పాదయాత్ర ప్రారంభించారు. రాజధాని పరిధిలోని వెంకటపాలెంలో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి తిరుమలకు మహిళలు, రైతులు పాదయాత్ర చేపట్టారు. అమరావతి పనులు ప్రారంభమైతే తిరుమల తిరుపతి దేవస్థానం వరకు పాదయాత్రగా వస్తామని ఉద్యమ సమయంలో రైతులు మొక్కుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం మొదలుపెట్టిన పాదయాత్రను తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. 20 రోజుల పాటు ఇది కొనసాగనుంది.




## 'దిశ' ఇక నుంచి ఉమెన్ సెఫ్టీ యాప్

మహిళల భద్రత కోసం జగన్ ప్రభుత్వం తెచ్చిన 'దిశ' యాప్ పేరును చంద్రబాబు ప్రభుత్వం ఉమెన్ సెఫ్టీ యాప్గా మార్చింది. గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. 2020 ఫిబ్రవరిలో దీన్ని ప్రారంభించగా, ఇప్పటివరకు 50 లక్షల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. యువతులు, మహిళలు ఆపదలో ఉంటే ఈ యాప్‌లోని ఫీచర్లు పోలీసులు, కుటుంబసభ్యులకు తక్షణమే సమాచారం అందిస్తాయి.


# 100 రోజులుగా జైల్లోనే కవిత..




ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టయి వంద రోజులు గడిచింది. ఈ వంద రోజులుగా ఆమె తీహార్ జైల్లోనే ఉంటున్నారు. ఈ ఏడాది మార్చి 15న హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కవిత ఇంట్లో సోదాలు జరిపిన ఈడీ ఆఫీసర్లు.. అదే రోజు సాయంత్రం ఆమెను అరెస్ట్ చేసి స్పెషల్ ఫ్లైట్‌లో ఢిల్లీకి తరలించారు. ఆ మరుసటి రోజు రౌస్ ఎవెన్యూలోని స్పెషల్ కోర్టులో హాజరు పర్చగా.. వారం రోజుల పాటు ఈడీ కస్టడీకి కోర్టు అప్పగించింది. ఆ తర్వాత మరో 3 రోజులు కస్టడీని పొడిగించింది. ఈ క్రమంలో కవిత తరఫు లాయర్లు ఆమెకు బెయిల్ ఇప్పించడానికి అనేక ప్రయత్నాలు చేశారు. కానీ.. ఈడీ ఎప్పటికప్పుడు కోర్టుకు అన్ని ఆధారాలు సమర్పిస్తూ, ఆమెకు బెయిల్ రాకుండా అడ్డుకుంది. ఈ క్రమంలో ఏప్రిల్‌లో సీబీఐ ఎంటరైంది. తీహార్ జైల్లో ఉన్న కవితను ఏప్రిల్ 11న సీబీఐ అరెస్ట్ చేసింది. ఆ తర్వాత రోజు ఆమెను కోర్టులో హాజరు పరుస్తూ.. లిక్కర్ స్కామ్‌లో కవితనే సూత్రధారి అని కోర్టుకు ఇచ్చిన కస్టడీ అప్లికేషన్‌లో సీబీఐ పేర్కొంది. కవితను మూడు రోజుల సీబీఐ కస్టడీకి అప్పగిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. ఇక అప్పటి నుంచి ఈడీ, సీబీఐ ఆమెను ప్రశ్నిస్తూనే ఉన్నాయి. చివరిగా ఈ నెల 21న కేసును విచారించిన కోర్టు.. సీబీఐ కేసులో జులై 5 వరకు కస్టడీని పొడిగించింది. ఈడీ కేసులో జులై 3న విచారణ చేపట్టనుంది. ఇక ఇప్పటికే పలుమార్లు కవిత బెయిల్ పిటిషన్లపై విచారణ జరిపిన ఢిల్లీ హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది.


బీఆర్ఎస్ సైలెంట్!

కవిత అరెస్ట్ సమయంలో బీఆర్ఎస్ నాయకులు హడావుడి చేశారు. అరెస్ట్ అన్యాయం, అక్రమం అంటూ ఈడీ అధికారులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈడీ అధికారులు కవిత ఇంట్లో ఉండగానే.. లోపలికి దూసుకెళ్లిన ఆమె అన్న కేటీఆర్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. కేంద్ర, రాష్ట్ర బలగాల సాయంతో కవితను ఈడీ ఆఫీసర్లు ఫ్లైట్‌లో ఢిల్లీకి తరలించారు. ఆ మరుసటి నాడే కేటీఆర్, హరీశ్‌రావు మరికొంత మంది నాయకులు ఢిల్లీకి వెళ్లి కవితకు బెయిల్ కోసం లాయర్లతో సంప్రదింపులు జరిపారు. కానీ, బెయిల్ రాలేదు. ఆ తర్వాత ఢిల్లీ నుంచి వచ్చేసి ఎన్నికల ప్రచారంలో బిజీ అయిపోయారు. వారం, పది రోజుల తర్వాత కవిత అరెస్ట్ గురించి మాట్లాడడం మానేశారు.



కవితను చూడని కేసీఆర్

తీహార్ జైల్లో ఉన్న కవితను కేటీఆర్, హరీశ్‌రావు, పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు, ఇతర కుటుంబ సభ్యులు పలుమార్లు కలిసి మాట్లాడారు. తల్లి శోభ కూడా జైలుకు వెళ్లి కవితను కలిశారు. కానీ, కవిత తండ్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాత్రం ఇప్పటివరకూ ఆమెను కలవడానికి వెళ్లలేదు. కవిత అరెస్ట్ తర్వాత ఇదే లిక్కర్ కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్ట్ చేసింది. ఆ సమయంలో కేసీఆర్ ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రతిపక్షాలపై కక్ష సాధింపు చర్యలో భాగంగానే కేజ్రీవాల్‌ను, ఇతర నాయకులను అరెస్ట్ చేశారని.. ఆయనను విడుదల చేయాలని అందులో ఆయన డిమాండ్ చేశారు. ఆ తర్వాత పార్టీ నాయకులతో జరిగిన మీటింగ్‌లో తనపై కక్ష సాధింపులో భాగంగానే కవితను అరెస్ట్ చేశారని కేసీఆర్ వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో బీజేపీ కేంద్ర నాయకుడు బీఎల్ సంతోష్‌పై కేసు పెట్టి అరెస్ట్ చేసేందుకు ప్రయత్నించినందునే, వాళ్లు కవితను టార్గెట్ చేశారని ఆయన ఆరోపించారు.



## నార్సింగి ఔటర్ రింగు రోడ్డు పై ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా

రంగారెడ్డి జిల్లా నార్సింగి ఔటర్ రింగు రోడ్డుపై ఘోర ప్రమాదం సంభవించింది. అతివేగంతో వచ్చిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ప్రమాదవశాత్తు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో.. బస్సు చక్రాల కింద పడి ఇద్దరు ప్రయాణికులు ప్రాణాలొదిలారు. అప్పటికే వర్షం పడగా.. రోడ్డు మొత్తం తడిగా ఉండటం.. బస్సు వేగంగా వస్తుడటంతో.. ఒక్కసారిగా అదుపుతప్పి బస్సు ప్రమాదానికి గురైంది. వేగంగా వెళ్తున్న బస్సు ఒక్కసారిగా బోల్తాకొట్టటంతో.. కిటీల్లోకి బయటపడి టైర్ల కింద నలిగి ఇద్దరు ప్రయాణికులు అక్కడికక్కడే ప్రాణాలొదిలినట్టు తెలుస్తోంది. మరో 15 మందికి గాయాలుకాగా.. క్షతగాత్రులందరినీ హుటాహుటిన హాస్పిటల్‌కు తరలించారు. సుమారు 9 గంటల సమయంలో బస్సు బోల్తాపడడంతో.. ఔటర్ రింగు రోడ్డుపై దాదాపు ఐదు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయ్యింది. మార్నింగ్ స్టార్ ట్రావెల్‌కు చెందిన బస్సు విజయవాడ నుంచి హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్డు మీదుగా ముంబయికి వెళ్తున్నట్లు సమాచారం. ప్రమాద విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. బస్సులో ఇరుక్కున్న ప్రయాణికులను వెలికి తీశారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించటంతో పాటు.. క్రేన్ సహాయంతో రోడ్డుపై నుంచి బస్సును తొలగించారు. అయితే.. ఈ బస్సు ప్రమాదంలో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ప్రమాదానికి ప్రధాన కారణం.. బస్సు నడుపుతున్న డ్రైవర్ మద్యం సేవించినట్టు తేలింది. డ్రైవర్‌కి పరీక్షలు చేయగా.. 187 పాయింట్లు వచ్చినట్లు తెలుస్తోంది. బాగా మద్యం తాగి మత్తులోనే డ్రైవింగ్ చేస్తున్నట్టుగా పోలీసులు తేల్చారు. మద్యం మత్తుతో పాటు మితిమీరిన వేగంతో బస్సు నడిపటంతోనే.. అదుపుతప్పి బోల్తా పడినట్టు పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు.




## విండీస్ ఇంటికి.. దక్షిణాఫ్రికా సెమీస్‌కి

టీ20 ప్రపంచ కప్ సూపర్-8 గ్రూప్2 నుంచి సెమీస్‌కు చేరిన జట్లేవో తేలిపోయాయి. తొలుత యూఎస్ఏపై విజయం సాధించిన ఇంగ్లాండ్ ఒక బెర్తును దక్కించుకోగా.. తాజాగా ఆతిథ్య వెస్టిండీస్‌ను చిత్తు చేసి దక్షిణాఫ్రికా అగ్రస్థానంతో సెమీస్‌కు దూసుకెళ్లింది. దీంతో రెండు ఆతిథ్యదేశాలు ఇంటిముఖం పట్టడం గమనార్హం. సెమీస్‌లో ఏ జట్టు ఎవరితో ఢీకొట్టనుందనే విషయం ఇవాళ జరిగే భారత్-ఆసీస్, అఫ్గాన్-బంగ్లాదేశ్ మ్యాచులతో తేలనుంది.

స్వల్ప స్కోరే అయినా..

సెమీస్‌కు దూసుకెళ్లాలంటే కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో విండీస్ చివరివరకూ పోరాడింది. కానీ, దక్షిణాఫ్రికా కూడా పట్టు వదలకుండా విజయం సాధించింది. విండీస్ నిర్దేశించిన 136 పరుగుల లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికా ఇబ్బంది పడింది. వర్షం అంతరాయం కలిగించడంతో మ్యాచ్‌ను 17 ఓవర్లకు కుదించి టార్గెట్‌ను 124 పరుగులుగా నిర్దేశించారు. చివరికి 16.1 ఓవర్లలో ఏడు వికెట్లను కోల్పోయి సఫారీల జట్టు విజయం సాధించింది. స్వల్ప వ్యవధిలోనే ఓపెనర్లు డికాక్ (12), హెడ్రిక్స్ (0) వికెట్లను కోల్పోయింది. ట్రిస్టన్ స్టబ్స్ (29), క్లాసెన్ (22), మార్కో ఎన్‌సెన్ (21*), మార్‌క్రమ్ (18) తలో చేయి వేసి లక్ష్యాన్ని ఛేదించారు. చివరి ఓవర్‌లో ఐదు పరుగులు అవసరమైన సమయంలో.. రబాడ సిక్స్‌తో మ్యాచ్‌ను ముగించాడు. రోస్టన్ ఛేజ్ బౌలింగ్‌లోనూ మెరిశాడు. మూడు వికెట్లు తీసి దక్షిణాఫ్రికాపై ఒత్తిడి తెచ్చాడు. ఆండ్రీ రస్సెల్ (2/19), అల్జారీ జోసెఫ్ (2/25) కట్టుదిట్టంగా బంతులేశారు.

ఛేజ్ హాఫ్ సెంచరీ..

తొలుత బ్యాటింగ్ చేసిన విండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 135 పరుగులు చేసింది. రోస్టన్ ఛేజ్ (52) హాఫ్ సెంచరీతోపాటు కేల్ మయేర్స్ (35) విలువైన పరుగులు సాధించాడు. దక్షిణాఫ్రికా (South Africa) బౌలర్లలో షంసీ 3 వికెట్లు తీయగా.. మార్కో ఎన్‌సెన్, మార్‌క్రమ్, కేశవ్ మహరాజ్, రబాడ తలో వికెట్ తీశారు. మిగతా బ్యాటర్లు పెద్దగా పరుగులు చేయకపోవడంతో విండీస్ స్వల్ప స్కోరుకే పరిమితమైంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా షంసీ నిలిచాడు.

## ఎన్టీఆర్ 31లో అలియా?



ఎన్టీఆర్ - ప్రశాంత్ నీల్ సినిమా ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి షూటింగ్ ప్రారంభం కానుంది. ఐతే, తాజాగా ఈ సినిమాకి సంబంధించి మరో క్రేజీ న్యూస్ వినిపిస్తోంది. ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అలియా భట్ నటిస్తోందని తెలుస్తోంది. మరి, అలియా భట్ నిజంగానే ఎన్టీఆర్ సరసన నటిస్తే.. ఆ క్రేజే వేరు. అలాగే, ఈ సినిమాలో మరో హీరోయిన్ కి కూడా స్కోప్ ఉందని.. ఆ పాత్రలో మరో స్టార్ హీరోయిన్ ను తీసుకునే ఆలోచనలో మేకర్స్ ఉన్నారని తెలుస్తోంది. మరి ఈ వార్తల్లో ఎంత వాస్తవం ఉందో చూడాలి. మొత్తానికి ప్రశాంత్ నీల్ - ఎన్టీఆర్ సినిమా కథ పై, తారక్ సరసన నటించే హీరోయిన్ పై చాలా రకాల వార్తలు వినిపిస్తూనే ఉన్నాయి. ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఈ సినిమా అప్ డేట్స్ ఆసక్తిగా ఎదురుచూ స్తున్నారు. అన్నట్టు ఆ మధ్య ఈ పవర్ హౌస్ ప్రాజెక్ట్ కోసం మిమ్మల్ని మీరు సిద్ధం చేసుకోండి అంటూ ఈ చిత్రబృందం ఓ మెసేజ్ ను కూడా పోస్ట్ చేసింది. మొత్తానికి ఈ సినిమా పై భారీగా అంచనాలు పెరిగిపోయాయి.